## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామంలో ఈ నెల 09 నుంచి నిర్వహించనున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ధర్మకర్త శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణ పరిధిలో 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని భూపాలపల్లి పట్టణ ఏఈ విశ్వాష్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లి సబ్ స్టేషన్‌లో ఉదయం 8గంటల నుంచి 9:30 గంటల వరకు, జంగేడు సబ్‌స్టేషన్‌లో 9:30 గంటల నుంచి 11 గంటల వరకు.. పట్టణంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంద న్నారు.

### ఒకరి రిమాండ్

టేకుమట్ల: హత్యాయత్నం కేసులో కోర్టు విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దాసరి సుధాకర్ తెలిపారు. మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి భిక్షపతిపై గతంలో హత్యాయత్నం కేసు నమోదైంది. కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. దీంతో పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు.

### కృష్ణశిలతో సరస్వతీమాత విగ్రహం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించే సరస్వతిపుష్కరాలకు వీఐపీ ఘాటు వద్ద సరస్వతిమాత విగ్రహం ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే. రూ.కోటితో కాళేశ్వరం దేవస్థానం నిధులతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడులోని మహబలిపురంలో సరస్వతీమాత విగ్రహాన్ని కృష్ణశిల రాయితో ప్రత్యేకంగా అక్కడి శిల్పి తయారు చేస్తున్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది. ఎప్రిల్‌లో కాళేశ్వరం క్షేత్రానికి తీసుకురానున్నట్లు తెలిసింది. దీంతో కాళేశ్వరక్షేత్రంతో పాటు వీఐపీ ఘాటు ప్రాంతంలో సందర్శకులు, భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా మారనుంది.

### గిట్టుబాటు ధర చెల్లించాలి

ములుగు రూరల్: రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన మిర్చికి గిట్టుబాటు ధర చెల్లించాలని బీఆర్‌ఎస్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని సర్వాపూరంలో మిర్చి కల్లాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చి పంటకు వేరుకుళ్లు, నల్లి ఆశించి దిగుబడి తగ్గిపోయిందని అన్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి మిర్చి సాగు చేస్తే ధర లేకపోవడంతో రైతులు అప్పులపాలు అవుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి పంటను మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అన్నారు. మిర్చికి క్వింటాకు రూ. 25 వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అప్పాజీ అయిలయ్య, లక్ష్మీనారాయణ, నర్సింహులు, శ్రీను, తిరుపతి, భిక్షపతి, నరేష్, చుక్కయ్య, గణేష్, భాగ్య, కనకయ్య పాల్గొన్నారు.

### హుండీలోని కానుకల లెక్కింపు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీల కానుకలను శుక్రవారం ఆలయ ఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. 2024 మార్చి నుంచి 2025 మార్చి వరకు ఆదాయం రూ.86,051 వచ్చినట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. అలాగే ఈ నెలలో నిర్వహించే స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటను బొగ్గుల నాగలక్ష్మి రూ.36,800లకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు శేఖర్, ఎస్‌ఆర్‌ఆర్ అభిలాష్ వర్మ ఉన్నారు.

### మిషన్ భగీరథ నీటిని అందించాలి

ములుగు రూరల్: జంగాలపల్లి క్రాస్ రోడ్డు ప్రజలకు మిషన్ భగీరథ నీరు రెండు నెలల నుంచి రావడం లేదని గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జంగాలపల్లి క్రాస్‌రోడ్డు వాసులు మాట్లాడుతూ.. గ్రామం మూడు పంచాయతీలు జంగాలపల్లి, బంజరుపల్లి, ఇంచర్ల గ్రామాల మధ్య ఉందని అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు పలుమార్లు తెలియజేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి జంగాలపల్లి క్రాస్ రోడ్డు వాసులకు మిషన్ భగీరథ నీటిని అందించాలని అన్నారు.

# మానేరులో రోడ్డు కష్టాలు..

- తాత్కాలిక రోడ్డు తొలగింపుతో ఇబ్బందులు
- పునర్‌నిర్మించాలని వాహనదారుల వేడుకోలు



మానేరులో రోడ్డును తవ్విన ప్రాంతం

టేకుమట్ల : పదేళ్ల క్రితం మండలంలోని గర్మిళ్లపల్లి శివారు మానేరువాగులో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు అప్పటి ప్రభుత్వం రూ.45 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేయడంతో పిల్లర్ల దశకు పరిమితమైంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ సంవత్సరం జూన్ నుంచి జనవరి వరకు మానేరులో నీటి ప్రవాహం ఉండడంతో మానేరులో కాలినడకన దాటి పోవాల్సి ఉంటుంది. నిత్యం మండలం నుంచి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు రాకపోకలు కొనసాగే దారిలో మానేరు కొంత కాలం పాటు నీటి ప్రవాహంతో పూర్తిగా రవాణా స్తంభింపజేస్తుంది. జనవరి, ఫిబ్రవరి నుంచి మే, జూన్ నెల వరకు నీటి ప్రవాహం తగ్గడంతో గర్మిళ్లపల్లి, ఓడేడ్ గ్రామాల ప్రజలు సమష్టిగా ఆయా గ్రామాల అభివృద్ధి కమిటీలు గ్రామస్తుల సహకారంతో మానేరులో తాత్కాలిక మట్టి రోడ్డును నిర్మించారు. నిర్మాణ ఖర్చులకు కొంత టోల్ పేర వాహనదారుల నుంచి వసూలు చేస్తూ రవాణా సౌకర్యాన్ని కల్పించారు. 10 ఏళ్ల నుంచి వాహనదారుల ప్రయాణ సౌకర్యార్థం మానేరులో తాత్కాలిక మట్టి రోడ్డు ఎంతో ఉపయోగకరంగా మారుతుంది. రెండు నెలల క్రితం మానేరులో ఓడేడ్, గర్మిళ్లపల్లి గ్రామాల అభివృద్ధి కమిటీకి ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.10 లక్షలు అందించి, మరో రూ.10 లక్షలతో మానేరులో తాత్కాలిక మట్టి రోడ్డును నిర్మించారు. అలా మట్టి రోడ్డును వినియోగించుకుంటున్న వాహనాలకు కొంత మేర సేవా రుసుమును వసూలు చేస్తుండడంతో మండలంలోని కొంత మంది టోల్‌ను రద్దు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఈ నెల 1న టేకుమట్ల, ఓడేడ్ మండలాల పోలీస్ రెవెన్యూ అధికారులు ప్రైవేట్ టోల్‌ను రద్దు చేశారు. అప్పటి నుంచి బుధవారం వరకు వాహనదారులు ఉచితంగా రోడ్డును వినియోగించుకున్నారు.

**తొలగించిన గుర్తుతెలియని వ్యక్తులు..**

బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మానేరులో ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డును తొలగించడంతో వాహనదారులు మండలం నుండిచి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు భూపాలపల్లి, మంథని నుంచి ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కరీంనగర్ జిల్లా, తనుగుల, పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ నుంచి ప్రయాణిస్తూ గంటల తరబడి అధిక దూరంతో పాటు, అధిక సమయాన్ని వెచ్చిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా తొలగించిన రోడ్డును పునర్ నిర్మించి రవాణాను మెరుగుపర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

### మానేరులో మట్టి రోడ్డు ఉపయోగకరం



మాది పరకాల మండలంలోని నాగారం గ్రామం. కారు ట్యాక్సీ నడుపుకునే నేను వారానికి సుమారు మూడు సార్లు టేకుమట్ల మీదుగా మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు కిరాయిలకు వెళ్తుంటాను. మానేరులో రోడ్డు తొలగించడంతో నేడు జమ్మికుంట మీదుగా పెద్దపల్లికి వెళ్లొచ్చాను.

- ఈర్ల రాజు, కారు ట్యాక్సీ, నాగారం, పరకాల మండలం

### టోల్ నిర్వాహకులపై కక్షతోనే..



ఎంతో మంది వాహనదారులకు ఉపయోగపడే విధంగా మానేరులో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించిన టోల్ నిర్వాహకులపై కక్షతోనే సమస్య సృష్టిస్తున్నారు. కొన్నేళ్లుగా ఇలాగే కొనసాగుతోంది. రోడ్డును తొలగిస్తే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- శాస్త్రాల కిషన్, ఆటో డ్రైవర్ పెద్దంపల్లి

# మెరుగైన వైద్యం పొందాలి



పురుషోత్తం రిపోర్టులను పరిశీలిస్తున్న వైద్యుడు

వాజేడు: మెరుగైన వైద్యం చేయించుకోవాలని కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కావిరి పురుషోత్తంకు మండల వైద్యాధికారి మధుకర్ సూచించారు. మండల పరిధిలోని కొంగాల గ్రామానికి చెందిన కావిరి పురుషోత్తం కిడ్నీ సమస్యతో బాధపడుతూ పది రోజులుగా వరంగల్ ఎంజీఎంలో వైద్యం చేయించుకుని కొంగాల గ్రామానికి తిరిగివచ్చాడు. ఆశకార్యకర్తల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన అక్కడికి వెళ్లి రిపోర్టులను పరిశీలించి పురుషోత్తం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, ఏఎన్‌ఎమ్ చాయాదేవి, ఆశకార్యకర్త నాగమణి ఉన్నారు.

# జనరిక్ మందులను వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆశాజ్యోతి

టేకుమట్ల: బ్రాండెండ్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాధిగ్రస్తులు జనరిక్ మందులు వాడాలని వెలిశాల వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. జన్ ఔషధ దివాస్ సందర్భంగా వెలిశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనరిక్ మందుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనరిక్ మందులు ఇతర మందులతో పోల్చితే 50 నుంచి 60 శాతం తక్కువ ధరకు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌ఎల్‌ఎచ్‌పీ డాక్టర్ మధురిమ, విజయ, సిబ్బంది విద్యాసాగర్, బుచ్చిబాబు, కృష్ణారెడ్డి, చిత్ర, రమేశ్ పాల్గొన్నారు.

# ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఎంపికైన ఎన్‌సీసీ కెడెట్లతో ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: ఎన్‌సీసీలో చేరడంతో క్రమశిక్షణ పెరుతుందని ప్రధానోపాధ్యాయులు విజయ్‌పాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌పాల్‌రెడ్డి, పాఠశాల ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో హవల్దార్ కుమార్, హవల్దార్ దినకరన్ ఎన్‌సీసీలో ప్రవేశాలకు పరీక్షలను నిర్వహించారు. ఈ ప్రవేశాల కోసం 37 మంది విద్యార్థులు పాల్గొనగా ఏడు మంది బాలికలను, 18 మంది బాలురని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌పాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరడం వలన మానసిక శారీరక ఎదుగుదలతో పాటు విద్య ఉద్యోగాల్లో ఈ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్‌కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, పద్మ, లలిత, విజయ భాస్కర్ శ్రీకాళ, చందర్, స్పందనతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పరిహారం చెల్లించే వరకూ పోరాటం



వెంకటాపురం(కె): మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలో బాండ్ మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందే వరకూ వారికి సీపీఎం అండగా ఉండి దశల వారిగా పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలిపాక, తిప్పాపురం, కొత్తగుంపు గ్రామాల్లో రైతులు నష్టపోయిన మొక్కజొన్న పంటను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.లక్ష ఇరవై వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు కంపెనీల నుంచి వచ్చే రాయితీలు, సౌకర్యాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్పా శ్రీను, సోలం రంగయ్య, పర్శిక కృష్ణ, మడకం చంద్రావ్, సోడి ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

**పరిహారం ఇప్పించాలి**

వాజేడు: మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.లక్ష నష్ట పరిహారం కంపెనీ నుంచి ఇప్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జజ్జరి దామోదర్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని ఘణపురం కాలనీ, కొప్పుసూరు, అరుణాచలపురం, ఆరుగుంటపల్లి, బొల్లారం గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి ఏఈఓ జాఫర్‌కు మొక్కజొన్న పంట నష్టంపై ఫిర్యాదు చేశారు. ఆయన వెంట కుర్సం ప్రవీణ్, శాంత కుమారి, కృష్ణ బాబుతో పాటు తదితరులు ఉన్నారు.

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి వినతి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డులో గల ఆంజనేయస్వామి ఆలయం పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆంజనేయస్వామి భారీ విగ్రహం ప్రతిష్ఠాపనకు సహకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, నాయకులు, గ్రామస్తులు శుక్రవారం కోరారు. మంత్రిని కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలుసుకొని వినతి పత్రాన్ని అందజేశారు. 45 ఫీట్ల విగ్రహం ఏర్పాటు పనులు చేపట్టినట్లు లక్ష్మీనర్సింహరావు తెలిపారు. అయితే జాతీయ రహదారి ఉండడం వల్ల ఆ విగ్రహం రోడ్డు పనులకు అడ్డువస్తుందని అధికారులు చెబుతున్నారని వివరించారు. విగ్రహం ఎదుట ఉన్న ఖాళీ స్థలం నుంచి కూడా రోడ్డు పనులు చేయవచ్చని మంత్రికి తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు పునరాలోచన చేసేలా చూడాలని కోరారు. ఆంజనేయస్వామి విగ్రహం గ్రామానికి రక్షణ కోసం నిర్మిస్తున్నట్లుగా మంత్రికి వివరించారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి బండి సంజయ్ సంబంధిత నేషనల్ హైవే ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్ చేసి విగ్రహానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు చేయాలని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

### ఉపాధ్యాయురాళ్లకు సన్మానం



సన్మానించిన యూనియన్ నాయకులు

భూపాలపల్లి అర్బన్: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ కళాశాల ఆవరణంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రవీణ్, రమేష్‌నాయక్, నీలిమారెడ్డి, వేణుగోపాల్, సదయ్య, గణేశ్‌లు పాల్గొన్నారు.

### గంజాయి కేసు విచారణ!

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఒకరి వద్ద గంజాయి దొరికిన విషయం తెలిసిందే. శుక్రవారం గంజాయితో లింకు ఉన్న వ్యక్తులను పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తు కూపీ లాగుతున్నట్లు తెలిసింది. సుమారుగా 400గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. గంజాయి వినియోగిస్తున్న వ్యక్తుల ఫోన్, వాట్సాప్‌లను చెక్ చేస్తున్నట్లు తెలిసింది. అన్ని కోణాల్లో పోలీసులు క్షుణ్ణంగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

### ఇసుక లారీలను విడుదల చేయాలి

ఏటూరునాగారం: అటవీశాఖ అధికారులు రెండు రోజుల క్రితం పట్టుకున్న ఇసుక లారీలను వెంటనే విడుదల చేయాలని ఇసుక లారీ డ్రైవర్లు శుక్రవారం అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అటవీశాఖ, టీజీఎండీసీ అధికారులను లారీలు విడుదల చేయాలని కోరారు. ఏటూరునాగారం మండలం చెక్ పోస్ట్ వద్ద ఏడు ఇసుక లారీలను సీజ్ చేసి అటవీశాఖ కార్యాలయానికి అధికారులు తరలించారు. ఈ లారీలు మండల కేంద్రంలోని మానసపల్లి ఇసుక ర్యాంపు నుంచి లోడ్ అయినవి, ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి ఇసుక క్వారీ నిర్వహించొద్దంటూ, నిబంధనలు ఉల్లంఘించారని వాటిని సీజ్ చేశారు. టీజీఎండీసీలో ఆన్‌లైన్ చేసుకుని వచ్చిన లారీలను ఎలా సీజ్ చేస్తారంటూ లారీ డ్రైవర్లు మండిపడ్డారు. తమ లారీలకు వే బిల్లులు ఉన్నాయని, ఆన్‌లైన్‌లో స్టాక్ పెడితే డీడీలు తీసుకొని ఇసుకను లారీల్లో లోడింగ్ చేయించుకున్నామన్నారు. అలాంటి లా రీలను రెండు రోజులుగా నిలిపివేయడం ఏమిటని మండిపడ్డారు. లారీలను విడుదల చేయకుంటే రాస్తారోకోకు దిగుతామని హెచ్చరించారు.

### కష్టపడితేనే సమాజంలో గుర్తింపు..



మల్హర్: మండలంలోని తాడిచర్లకు చెందిన ముదరకొళ్ల సమ్మక్క స్వయం సహాయక సంఘాల ద్వారా పదేళ్ల క్రితం రూ.20 వేలు రుణం పొందింది. ఆ డబ్బుతో గాజుల వ్యాపారం ప్రారంభించింది. ప్రస్తుతం రూ.3 లక్షలతో గాజులు, బోట్లు, చెప్పులు, మహిళలకు చెందిన ఇతర సామగ్రి నితో వ్యాపారాన్ని విస్తరించింది. 'చేసే పనిలో సంతోషం వెతుకుతున్నా.. కష్టపడితేనే సమాజంలో గుర్తింపు లభిస్తుంది' అని సమ్మక్క చెబుతోంది.

# ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటా..

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, తన గెలుపు కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలని, అందు కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా నాయకులు రాంనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు మార్కెట్ ధర చెల్లించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి



మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి: గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ఏర్పాటులో భూములను కోల్పోయిన రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన రైతులతో కలిసి ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే సందర్భంగా ఎంతోమంది రైతులు భూములను కోల్పోయరని వారికి మార్కెట్ ధర కల్పించి ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎకరాకు మూడు కోట్ల రూపాయలను విలువచేసే భూములు కోల్పోతున్నప్పటికీ వారికి తూతూ మంత్రంగా నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకునేందుకు కుట్రలు చేస్తుందన్నారు. ఈ విషయంలో భూములను కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం కల్పించాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారన్నారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి మండల కేంద్రంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశీధర్‌రెడ్డి రైతులు అడ్డూరి రాజేందర్ సత్యనారాయణరెడ్డి, రామచంద్రరావు బండారు శ్రీనివాస్, తిరుపతి కొల్లూరు స్వప్న, గుర్రపు సునందరెడ్డి, మోరే పద్మ, శనిగరపు శ్రీనివాస్, మొగులపల్లి, టేకుమట్ల, చిట్యాల, శాయంపేట మండలాల రైతులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల కోసం తవ్వకాలు

- ఐదుగురిపై కేసు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డిజిటల్ డిటెక్టర్ పరికరాలు

కాళేశ్వరం: గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఇంజాపూర్ వెంకటరమణ, జనగామ జిల్లా చిల్పూర్ మండలం శ్రీపతిపల్లికి చెందిన పల్లపు నరసింహా, భువనగిరి జిల్లా చౌదరిపల్లికి చెందిన షేక్ షరీఫ్ ఉద్దీన్, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తికి చెందిన ఎండీ రియాజ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన పిల్లి అశోక్‌కుమార్ డిజిటల్ డిటెక్టర్ పరికరాలతో మహదేవపూర్ మండలం ఏన్కపల్లి గ్రామ శివారులో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20 నిమ్మకాయలు, పసుపు, రంగునీళ్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. స్థానికుడు సమ్మయ్య పరారయ్యాడు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



చిట్యాల: ఉపాధ్యాయులతో విద్యార్థులు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. అనంతరం విద్యార్థులు వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీపాల్, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**గొల్లబుద్ధారం ప్రభుత్వ పాఠశాలలో..**

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానస, ఉపాధ్యాయినిలు శోభ, మహేశ్వరి, మనీషా మౌనిక పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారుల పొలంబాట



పొలంబాట కార్యక్రమంలో విద్యుత్ అధికారులు

టేకుమట్ల: టేకుమట్ల సెక్షన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేష్ మాట్లాడుతూ రైతులు వారి వ్యవసాయ బోర్లు, బావుల వద్ద గల మోటర్ల స్టాటర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్టార్టర్ల వద్ద విద్యుత్ సమస్య ఏర్పడితే విద్యుత్ అధికారుల సూచన మేరకు అనుభవజ్ఞులైన టెక్నీషియన్లతో మరమ్మతులు చేపించుకోవాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఏఈలు విశ్వాస్‌రెడ్డి, మణిదీప్, లైన్‌మెన్ రఘు, కిరణ్, రైతులు ఉన్నారు.